క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఆత్మకూరు: గిరిజనులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని గిరిజనకాలనీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ కనబరిచితేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్, డాక్టర్ ఎస్‌కే అస్మా, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు సుధాకర్, పద్మావతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీలు



అల్లూరు: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కావలి ఆర్డీఓ శీనానాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి నూతన తహసీల్దార్ లక్ష్మీనారాయణకు పలు సూచనలు చేశారు. అనంతరం అల్లూరు-4 సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు.

నీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ



జలదంకి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి నాణ్యత పరీక్షలపై ఆరోగ్య సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. గ్రామీణ నీటి పారుదల శాఖకు చెందిన జిల్లా స్థాయి శిక్షణాధికారి శ్యాంప్రసాద్ మంచినీటి పరీక్షల ద్వారా జీవ, రసాయన సంబంధమైన కలుషితాలను కనుగొనే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నీటి వనరులను పరీక్షించి అవి తాగునీటికి, ఇతర అవసరాలకథే మేరకు పనికి వస్తాయో నిర్ధారించి అందుకు అనుగుణంగా సురక్షితమై నీటిని ప్రజలు వాడుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ఉదయగిరి: మండలంలోని వివిధ పంచాయతీల పరిధిలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని అర్లపడియ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్య పరిస్థితిని పరిశీలించి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ మల్లికార్జున ఉన్నారు.

ఉదయగిరి ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓగా పద్మావతి



ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓగా పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతసాగరం ప్రాజెక్ట్ సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఉన్నతాధికారులు ఉదయగిరికి ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తామన్నారు.

తల్లిదండ్రులతో సమావేశం

సోమశిల: రేవూరు బీసీ బాలికల వసతిగృహంలో ఏబీసీడబ్ల్యూఓ శ్రీదేవి సమక్షంలో తల్లిదండ్రుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వార్డెన్ గృహమల్లేశ్వరి మాట్లాడుతూ వసతిగృహంలో కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఏబీసీడబ్ల్యూఓ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న వార్డెన్‌ను అభినందించారు. నాయకులు నాగార్జునరెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

తెరుచుకోని వ్యవసాయ కార్యాలయం

అల్లూరు: మండల వ్యవసాయ కార్యాలయం గురువారం ఉదయం 11గంటలకు కూడా తెరుచుకోలేదు. మండల వ్యవసాయాధికారితో పాటు విలేజ్‌అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఎవరూ రాకపోకవడంతో కార్యాలయం మూతపడింది. దీంతో వివిధ సేవల నిమిత్తం వచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై వ్యవసాయాధికారిణి ఫోన్‌లో వివరణ కోరగా, కావలికి సమావేశం నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు.

బాబోయ్ దొంగలు

ఆత్మకూరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- రెండు నెలల వ్యవధిలో ముప్పైకుపైగా ఘటనలు
- హడలిపోతున్న ప్రజలు





ఆత్మకూరులోని ఓ ఇంట్లో బీరువాను పగులగొట్టి వస్తువులను బయటపడేసిన దృశ్యం

ఆత్మకూరు: దొంగలు ప్రజలను హడలెత్తిస్తున్నారు. వరుస చోరీలతో కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. పథకం ప్రకారం తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. చోరీలకు పాల్పడుతూ సొత్తు దోచేస్తున్నారు. ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో రెండు నెలల వ్యవధిలో 30కుపైగా చోరీలు జరిగాయి. ఇంకా చిన్నచిన్న చోరీలు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో వెలుగులోకి రాలేదు. ఆత్మకూరు పట్టణంలో గత రెండు రోజుల వ్యవధిలో వరుసగా రెండు చోరీలు జరిగాయి. గత నెలలో సంగం మండలంలో ఒకే రోజు ఆరు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏఎస్‌పేట మండలంలో ఏడు ఆలయాల్లోనూ ఒకే రోజు చోరీలు జరిగాయి. ఆత్మకూరు పట్టణంలో తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు జరుగుతుండడంతో ఆరితేరిన దొంగల ముఠా దిగిందేమోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా చోరీలు జరుగుతున్నా పోలీసులు విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

రెండు నెలల వ్యవధిలో జరిగిన చోరీలు

➡ వారం రోజుల క్రితం ఆత్మకూరులోని నారాయణరావుపేటలో ఓ మహిళ మెడలోని సరుడును దొంగ అపహరించుకెళ్లారు. ఈ ఘటన సీసీ ఫుటేజీల్లోనూ రికార్డు అయింది. ఇప్పటి వరకు దొంగను పోలీసులు పట్టుకోలేదు.

➡ ఆత్మకూరులోని ఎల్ఆర్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీ డిపో ఎదురు వీధిలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వారు దుకాణంలో ఉండగా ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో రూ.30వేలు నగదు అపహరించుకెళ్లారు.

➡ గత రెండు రోజుల క్రితం జేఆర్‌పేటలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరుకు వెళ్లిన క్రమంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 15 సవర్ల ఆభరణాలు, వెండి గిన్నె, రూ.5వేలు నగదు దోచుకెళ్లారు. ఆ మరుసటి రోజే అదే ప్రాంతంలో నివశించే ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే ఉద్యోగి ఇంట్లోనూ దొంగలు చోరీకి పాల్పడ్డారు. రెండు సవర్ల నగలతో పాటు వెండి నాణేలను ఎత్తుకెళ్లారు

➡ గత నెలలో అనంతసాగరం మండలం సోమశిలలో చేపల దుకాణం రేకులు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ.25వేలు నగదు ఎత్తుకెళ్లారు.

➡ గత నెలలో సంగంలో ఒకరోజు ఐదు, మరోరోజు ఐదు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రామారావు ఇంట్లో రూ.2 లక్షల విలువైన బంగారు గాజులు, కాకు రమాదేవి ఇంట్లో రూ.60వేలు నగదు, రెండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, వెంకటరమణ ఇంట్లో రూ.50 వేలు, వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించే శీనయ్య ఇంట్లో రూ.50వేలు నగదు చోరీ చేశారు.

➡ ఇటీవల ఏఎస్‌పేట మండలం చిరమనలోని ఓ ఇంట్లో రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలను దొంగలు చోరీ చేశారు.

➡ ఇటీవల ఒకే రోజు ఏఎస్‌పేట మండలంలోని ఏడు చిన్నా, పెద్దా దేవాలయాల్లో చోరీలు జరిగాయి. సుమారు రూ.60వేలకుపైగా సొత్తును ఎత్తుకెళ్లారు. కొండమీదకొండూరు, గుంపర్లపాడు, కావలియడవల్లి, ఏఎస్‌పేట, తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో చోరీలు జరిగాయి.

➡ ఇటీవల మర్రిపాడు మండలంలోని డీసీపల్లి, కృష్ణాపురం, పొంగూరుకండ్రిక, బూదవాడ, ఏపిలగుంట, మర్రిపాడు, పెగళ్లపాడు గ్రామాల్లో చోరీలు చోటు చేసుకున్నాయి. కండ్రికలో జరిగిన చోరీలో కేజీ వెండి వస్తువులతో పాటు రూ.25వేలు నగదును దోచుకెళ్లారు.

➡ కొన్ని గ్రామాల్లో గేదెలను సైతం దొంగలు అపహరించుకెళ్లడం విశేషం.

పనిచేయని సీసీకెమెరాలు

ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో చోరీలు అధికంగా జరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో దాతల సహకారంతో ఆత్మకూరు పట్టణంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కానీ పలు చోట్ల సీసీకెమెరాలు మరమ్మతులకు గురై పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయిస్తే కేసులను ఛేదించేందుకు దోహదపడుతాయి. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది కొరత ఉంది. దీంతో రాత్రి వేళల్లో గస్తీ కొరవడి దొంగలు హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీని పెంచడంతో పాటు సీసీకెమెరాలను వినియోగంలోకి తీసుకొచ్చి చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గస్తీని పెంచుతాం

ఆత్మకూరు డివిజన్ పరిధిలో చోరీల కట్టడికి గస్తీని పెంచాం. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను బాగు చేయిస్తున్నాం. స్థానికంగా ఉండే వారే చోరీ చేస్తున్నట్లు సమాచారం. కొద్దిరోజుల వ్యవధిలోనే చోరీలకు పాల్పడిన వారిని పట్టుకుంటాం.

– ఎస్ కోటారెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ

ఏకపక్షంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



ఏఎస్‌పేట: గుంపర్లపాడులో ఎన్నిక ఆపాలంటూ హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగిన టీడీపీ శ్రేణులు



ఆత్మకూరు బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఎంఈఓలతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



రామవరపాడులో పాఠశాల వద్ద నుంచి బయట వ్యక్తులను పంపిస్తున్న పోలీసు

బిట్రగుంట: బోగోలు మండలంలో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు దాదాపుగా ఏకపక్షంగా జరిగాయి. మండలంలో 58 పాఠశాలలు ఉండగా ఎస్వీపాళెం ఎస్టీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో కోరం లేని కారణంగా ఎన్నికను వాయిదా వేశారు. మిగిలిన పాఠశాలల్లో టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఎన్నికలు పూర్తి చేశారు. 8 జిల్లా పరిషత్ ఉన్నత, ఐదు ప్రాథమికోన్నత, 44 ప్రాథమిక పాఠశాలలకు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోగోలు, పాతబిట్రగుంట ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి కమిటీలను ఎన్నుకున్నట్లు ఎంఈఓ జయమ్మ తెలిపారు.

మర్రిపాడు: మండలంలో 89 పాఠశాలలకు గాను 88 పాఠశాలలకు యాజమాన్య కమిటీలను ఎన్నుకున్నట్లు ఎంఈఓ-2 ధనలక్ష్మి తెలిపారు. పల్లవోలు ప్రాథమిక పాఠశాలలో కోరం లేని కారణంగా ఎన్నిక వాయిదా పడిందని చెప్పారు. కాగా నందవరం పాఠశాల కమిటీ చైర్మన్‌గా షేక్ మునాఫ్, వైస్‌చైర్మన్‌గా సయ్యద్ హసీనా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంగం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. గాంధీజనసంఘం, తలుపూరుపాడు, మర్రిపాడు పాఠశాలల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఎస్సై నాగార్జునరెడ్డి పాఠశాలల వద్దకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికలను ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య పర్యవేక్షించారు.

కలిగిరి: మండలంలోని 69 పాఠశాలలకు సంబంధించి విద్యా కమిటీలను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎంఈఓ జీ సురేష్ తెలిపారు.

చేజర్ల: మండలంలో 59 పాఠశాలలు ఉండగా, 58 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గాలిపాళెం పాఠశాలలో ఎన్నిక నిర్వహించినట్లు ఎంఈఓ-2 మస్తానయ్య తెలిపారు. కాగా చేజర్ల, టీకేపాడు, నాగులవెలటూరు, పెరుమాళ్లపాడు, తదితర పాఠశాలల కమిటీల ఎన్నికలో టీడీపీ నాయకులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు.

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని 48 పాఠశాలల్లో నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అధిక సంఖ్యలో పాఠశాలల్లో టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఎన్నికలు జరిగాయి. వింజమూరు ఉన్నత పాఠశాల కమిటీ ఎన్నికను అధికార పార్టీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు. తమకు అనుకూలమైన వారు ఎన్నికయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా పాఠశాల చైర్మన్‌గా బండి మురళీకృష్ణ, వైస్‌చైర్మన్‌గా షేక్ హుస్సేన్‌బీ ఎన్నికయ్యారు.

వరికుంటపాడు: మండలంలో 58 పాఠశాలలు ఉండగా, 55 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. మహ్మదాపురం, జంగంరెడ్డిపల్లి, తూర్పు బోయమడుగుల పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు జరగలేదు. నార్త్‌కొండాయపాళెం జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. పెద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణను ఎంఈఓలు షాఉద్దీన్, రమణయ్య పర్యవేక్షించారు.

కొండాపురం: మండలంలో 66 పాఠశాలలు ఉండగా, 65 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి. 61 పాఠశాలల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. నేకునాంపేట ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.

రసాభాసగా ఎన్నికలు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణం, మండలంలోని పాఠశాలల్లో జరిగిన యాజమాన్య కమిటీ ఎన్నికలు అధికార పార్టీ నాయకుల జోక్యంతో రసాభాసగా మారాయి. ఆత్మకూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓ చలపతి, హెచ్‌ఎం కోటేశ్వరమ్మతో టీడీపీ నాయకులు సమావేశమై తాము చెప్పిన ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎట్టకేలకు హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నిక నిర్వహించింది. చైర్‌పర్సన్‌గా సయ్యద్ తహశీల్ సుల్తానాను ఎన్నుకున్నారు. కాగా వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించే క్రమంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలని హెచ్‌ఎం చెబుతున్నా వినిపించుకోకుండా మైనార్టీ అభ్యర్థినే చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. కాగా టీడీపీకి చెందిన కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి సైతం ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలని పట్టుబట్టారు. దీంతో టీడీపీలోనే రెండు వర్గాలా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇరువర్గాల నడుమ వాదోపవాదనలు చోటు చేసుకోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. మధ్యాహ్నం 4 గంటలకు మరోమారు ఎన్నికకు ప్రయత్నించినా ఎవరూ రాకపోకవడంతో వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదాపడింది. బైపాస్ రోడ్డులోని గురుకుల బాలికల పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగినా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా మండలంలోని 55 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 13 ఉన్నత పాఠశాలలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించగా, బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోరంలేని కారణంగా ఎన్నిక వాయిదాపడింది.

గుంపర్లపాడులో టీడీపీ శ్రేణుల రచ్చ

అనుమసముద్రంపేట: గుంపర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు రచ్చరచ్చ చేశాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడాన్ని ఓర్వలేక టీడీపీ శ్రేణులు అడ్డుకునేందుకు యత్నించాయి. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. అనంతరం టీడీపీ మద్దతుదారులు ఒక్కసారిగా పాఠశాలలోకి వచ్చి ఎన్నికలను ఆపాలని, లేదంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్‌ఎం పోతులూరయ్యతో వాదనకు దిగడంతో మళ్లీ అలజడి మొదలైంది. పాఠశాలలో ఉన్న టీడీపీకి చెందిన మహిళలను బయటకు వచ్చేయాలని కేకలు వేయడంతో వారు బయటకొచ్చారు. దీంతో ఎన్నిక ఎలా జరపాలో ప్రధానోపాధ్యాయుడికి అర్థం కాలేదు. కొద్దిసేపటి తరువాత మరికొందరు మహిళలు లోపలకు రావడంతో కోరం ఉండడంతో ఎన్నికలు నిర్వహించారు. దీంతో 18మంది సభ్యులతో పాటు ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికవడం జీర్ణించుకోలేక టీడీపీ శ్రేణులు రచ్చరచ్చ చేస్తుండడంతో ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో పాఠశాల వద్దకు చేరుకుని అక్కడి నుంచి పంపించి వేశారు.

జలదంకి: మండలంలో 59 పాఠశాలలు ఉండగా, 12 పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామవరపాడు ప్రాథమిక పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 46 పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. కాగా రామవరపాడు పాఠశాలలో సభ్యుల ఎన్నిక తరువాత చైర్మన్ ఎన్నిక విషయంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగారు. దీంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు హెచ్‌ఎం అంకులు తెలిపారు. అలాగే అన్నవరం, దాసరిఅగ్రహారం, హనుమకొండపాళెంలో కూడా టీడీపీకి చెందిన రెండు వర్గాలు హల్‌చల్ చేశాయి. చివరకు పోలీసుల సాయంతో ఎన్నికలు సజావుగా సాగాయి. హనుమకొండపాళెంలో టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు వాగ్వాదానికి దిగడంతో కలిగిరి సీఐ వెంకటనారాయణ అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి, కేవలం తల్లిదండ్రులను మాత్రమే లోపలికి పంపించి ఎన్నిక జరిగేటట్లు చేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

అనుమసముద్రంపేట: రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి తెలిపారు. గురువారం చిరమనలోని పంట పొలాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువుల యాజమాన్యంపై పలు సూచనలు చేశారు. పచ్చిరొట్ట ఎరువులతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పంట వేసిన ప్రతి రైతుకు ఈ-పంట తప్పక నమోదు చేస్తామని, అందుకు తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. కౌలు రైతులు సాగు చేస్తున్న భూములకు సీసీఆర్ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ సంచాలకులు నర్సోజీరావు, శేషగిరిరావు, ఏడీఏ వి.దేవసేనమ్మ, ఏఓ టి.రజని, సిబ్బంది ఉన్నారు.

వరికుంటపాడు: ఖరీఫ్ పంటలను రైతులు తప్పనిసరిగా వీఏఏల ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. మండలంలోని రామాపురంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ- క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు, బ్యాంకుల్లో పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే పరిహారం పొందేందుకు అర్హులని తెలిపారు. అనంతరం కంది, మినుము పంటల్లో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఆయన వెంట వీఏఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మర్రిపాడు : స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ క్రాప్ నమోదుపై వీఏఏలకు మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన్ గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ-క్రాప్ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌలు రైతుల కార్డుల ప్రాముఖ్యతను వివరించారు. డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి జీ సురేష్, ఏఎస్ఓ రామకిషోర్ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



అల్లూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

అల్లూరు: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ జ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, వీధీదీపాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్‌ల విధులు, బాధ్యతలను వివరించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మండలాధికారులు సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల భాగస్వామ్యం గురించి వివరించారు. కాగా ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు కొద్ది మంది మాత్రమే హాజరయ్యారు.

నష్ట పరిహారం చెల్లించాలని వినతి

ఆత్మకూరు: 67వ నంబర్ జాతీయరహదారి నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి నష్టపరిహారాన్ని చెల్లించాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్డీఓ మధులతను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి మీదుగా చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి సంబంధించి 36 మంది రైతుల నుంచి భూములను సేకరించినట్లు తెలిపారు. నెలలు గడుస్తున్నా భూములకు నష్టపరిహారం చెల్లించలేదని చెప్పారు. పలుమార్లు మండల తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని వాపోయారు. స్పందించిన ఆర్డీఓ త్వరలో నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం, ఏపీ రైతు సంఘ నాయకులు గంటా లక్ష్మీపతి, కృష్ణ ప్రసాద్, సాధిక్ హుస్సేన్, ఖాజారసూల్, ఎం పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి



ఆత్మకూరు: పట్టణంలోని కొలగానిరామయ్య సత్రం ప్రాంతంలో 70 ఏళ్లకుపైగా నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయాలని దేవదాయ శాఖ మంత్రి, అధికారులు నోటీసులు అందజేయడం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం ఆయన కొలగానిరామయ్యసత్రం ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాను చిన్నవయస్సులో మిత్రులతో గడిపిన విషయాలను గుర్తు చేసుకున్నారు. 70 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయాలనడం సరికాదని, వారికి అదే ప్రాంతంలో శాశ్వత పట్టాలు ఇచ్చేలా మంత్రి, అధికారులు ఆలోచన చేయాలన్నారు. పేదలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పరపతి ఉంటేనే ఇసుక లోడింగ్



ఇసుక డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న తహాశీల్దారు స్వప్న

మర్రిపాడు: 'సుదూర ప్రాంతాల నుంచి డంపింగ్ యార్డుకు వచ్చాం..నాలుగు రోజులుగా ఇసుక కోసం వేచి ఉన్నాం..సీరియల్ నంబర్ ప్రకారం ఇసుక లోడింగ్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. స్థానికంగా పరపతి ఉన్న వారికే ముందస్తుగా ఇసుక లోడింగ్ చేస్తున్నారు..తమ వాహనాలకు మాత్రం లోడింగ్ చేయడం లేదు' అంటూ పలువురు లారీ డ్రైవర్లు తహసీల్దార్ స్వప్న ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మర్రిపాడు తహసీల్దార్ స్వప్న ఇసుక డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహించాల్సిన సచివాలయ సిబ్బంది లేకపోవడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇసుక లోడింగ్‌పై డ్రైవర్లను ఆరాతీయగా, వారు తమ బాధలను మొరపెట్టుకున్నారు. స్పందించిన తహసీల్దార్ అక్కడ ఉన్న పోలీసులను ఇసుక లోడింగ్‌కు వచ్చే వారి ఆధార్ కార్డులను పరిశీలించి సీరియల్ నంబర్ ప్రకారమే లోడింగ్ చేసేలా చూడాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇసుక లోడింగ్ విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్డీఓ పరిశీలన

మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డును ఆత్మకూరు ఆర్డీఓ మధులత గురువారం ఉదయం పరిశీలించారు. ఇసుక లోడింగ్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ సురేంద్ర తదితరులు ఉన్నారు.

పరామర్శ



శివకేశవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పలు కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఉదయగిరి బిట్-1 ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతయ్య తల్లి, వింజమూరు మండలం నందిగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాగిపిండి లక్ష్మిరెడ్డి, వింజమూరులోని వివేకానంద విద్యాసంస్థకు చెందిన మద్దూరి శివకేశవరెడ్డి ఇటీవల మరణించగా వారి ఉత్తరక్రియలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మేకపాటి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.